ప్రజాశక్తి
గురువారం 23 జనవరి 2025 5
శ్రీ సత్యసాయి





సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజా సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే : కెవిపిఎస్

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రజాసమస్యలను పట్టించుకోవటం లేదని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి. రమణ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన పేదలతో కలసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను విన్నవించడానికి ఇంటి వద్దకు వస్తే వారిని కనీసం పలకరించకుండా పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజలను తోసి వాహనాల్లో వెళ్లిపోయారని అన్నారు. ఆయన వైఖరి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలా అనిపిస్తోందన్నారు. కొల్లకుంట సమీపంలో సొంతిల్లు లేని నిరుపేదలు భూ పోరాటం ద్వారా గుడిసెలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఆ స్థలాల్లో ఇంటి పట్టాలను మంజూరు చేయించాలని కోరుతూ బుధవారం స్థానిక ఎమ్మెల్యేకు వినతిని అందించడానికి సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు బాలయ్య నివాసం వద్దకు వస్తే ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. సమస్యను చెప్పుకోవడానికి వచ్చిన వారిని కనీసం కలవకుండా, పోలీసులను అడ్డుపెట్టుకుని అక్కడ ఉన్న ప్రజలను తోసేసి వాహనంలో వెళ్ళిపోయారన్నారు. ఇప్పటికైనా దీనిపై బాలకృష్ణ పునరాలోచించి అక్కడ ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయడంతో పాటు అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలకు సైతం సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు నరసింహులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు రాయుడు, సరస్వతమ్మ, గంగమ్మ, సరస్వతి, ఆదిలక్ష్మి, మారుతి, రామాంజప్ప, మల్లయ్య తో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

పేరుకే 'స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్'

నామ మాత్రంగా చెత్తతో సంపద కేంద్రాలు
ఇరిగేషన్ చెరువులే డంపింగ్ కేంద్రాలు
కలుషితమవుతున్న చెరువు నీరు
నిద్రావస్థలో ఆయాశాఖల అధికారులు



చెరువులో వేసిన వ్యర్థాలు

ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం పారిశుధ్యకార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టింది. స్వచ్ఛ భారత్‌లో భాగంగా చెత్తతో సంపద తయారు చేసే కేంద్రాలు మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ కేంద్రానికి ఒక్కటి చొప్పున ఉన్నాయి. అయితే ఈ చెత్త కేంద్రాలను నామ మాత్రంగా నిర్వహిస్తూ సేకరించిన తడిపొడి చెత్తను ఇరుగేషన్ చెరువులలో వేస్తుండటం ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. మండల కేంద్రం కావడంతో అత్యధిక సంఖ్యలో దుకాణాల నుండి వ్యర్థాలు వెలువడుతుంటాయి. అయితే వాటికి తగ్గట్టుగా పంచాయతీలో పారిశుధ్య పనుల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. మండల కేంద్రంలో సేకరించిన తడి, పొడి చెత్త ను చెత్త కేంద్రంలో డివైడ్ చేసి వర్మీ కంపోస్ట్ గాను, ప్లాస్టిక్ రీసైకిలింగ్ చేసి అమ్మడం ద్వార సంపదను సృష్టించాల్సుంది. అయితే సేకరించిన చెత్తను చిలమత్తూరు చెరువు, బైరే కుంట చెరువులో వేస్తూ ఇరిగేషన్ చెరువులను కలుషితం చేస్తున్నారు.

నామమాత్రంగానే చెత్త కేంద్రాలు

చిలమత్తూరు గ్రామ పంచాయతీలోని చెత్త కేంద్రాన్ని నామ మాత్రంగా నిర్వహిస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి సంపదగా మార్చాల్సిన అధికారులు ఆ పని చేయడం లేదు. కొన్ని తొట్టెలలో వర్మీ కాంపోస్ట్ తయారు చేస్తున్నట్లు చూపుతున్నా ఆ వర్మీ కంపోస్ట్ ద్వారా పంచాయతీకి వచ్చిన ఆదాయం నామ మాత్రంగా కూడా లేదు. ప్లాస్టిక్ రీసైకిలింగ్ కోసం పెద్ద పెద్ద యంత్రాలు ఉన్న వాటి ద్వారా రీసైకిల్ చేసి పొందిన ఆదాయం కూడా ఏమి లేదు. మండల కేంద్రంలో సంత ప్రాంతంలో ఈ చెత్త కేంద్రాలను షోగా చూపిస్తూ మొత్తం చెత్త,వ్యర్థాలను చెరువులలో వేస్తూ డంప్ కేంద్రాలుగా వాటిని మార్చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలలో సమస్యలు

డివి అండ్ ఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు భాగాన ఉన్న బైరే కుంట చెరువు పక్కనే ఉన్న గంగమ్మ గుడి చుట్టు పక్కన చెత్తతో పాటు, కోళ్ల వ్యర్థపదార్థాలు వేస్తుండటంతో దుర్వసన వెదజల్లుతోంది. దీంతో కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే హిందూపురం ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో వాహనాలను కుక్కలు అడ్డుగా వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికి అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

పట్టించుకోని పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు

ఓ విద్యాలయం, ఓ దేవాలయం, పైగా మండల కేంద్రం సగానికి నీటిని అందించే తాగునీటి పంచాయతీ బోరు, హిందూపురానికి వెళ్లే ప్రధాన రహదారి ఇన్ని ఉన్న చెరువు కట్ట ప్రాంతంలో చెత్త వేసేందుకు అనుకూలంగా ఉందని పంచాయతీ అధికారులు అనుకున్నారో ఏమో ఈ ప్రాంతంలో చెత్తను వేస్తున్నారు. ఓ వైపు ఇరిగేషన్ చెరువు కాలుష్యంలో చిక్కుకుంటున్నా, కోళ్ల వ్యర్థాలు ప్లాస్టిల్ వ్యర్థాలతో భూ గర్భ జలాలు కలుషితం అవుతున్నా, వ్యర్థాలను ఆహారంగా తీసుకునేందుకు వచ్చిన కుక్కల వల్ల ప్రమాదాలు జరుగుతున్నా ఇటు ఇరిగేషన్, అటు పంచాయతీ అధికారులకే ఏమాత్రం పట్టడం లేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఈ చెత్త ను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



చెరువు గట్టుపై వేసిన వ్యర్థాలు



కుంట చెరువు గంగమ్మ గుడి వద్ద ఉన్న కోళ్ల వ్యర్థాలు తింటున్న కుక్కలు



ఎమ్మెల్యేకు చెక్కును అందిస్తున్న ఎల్ఆర్‌జి విద్యా సంస్థల ప్రతినిధులు

సిఎం సహాయ నిధికి 'ఎల్ఆర్‌జి' విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ఎల్ఆర్‌జి విద్యాసంస్థలు రూ.1లక్ష అందజేశాయి. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు సంబంధిత మొత్తాన్ని విద్యా సంస్థల డైరెక్టర్ నికిల్ గోవింద్ రామమూర్తి, కార్యదర్శి బాలసుందరం అందజేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేను సన్మానించి ఈ మేరకు చెక్కును అందించారు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం విరాళ అందించడం పట్ల విద్యాసంస్థల నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ అధికారి రఘు, సంజీవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'నకిలీ బంగారం' ముఠా అరెస్టు

ప్రజాశక్తి-సోమందేపల్లి

నకిలీ బంగారం చూపి ప్రజలను మోసం చేస్తున్న పది మందితో కూడిన ముఠాను బుధవారం అరెస్టు చేసినట్లు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని స్టేషన్లో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సిఐ రాఘవన్, స్థానిక ఎస్ఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను డీఎస్పీ వెంకటేశ్వరరావు వెల్లడించారు. సోమందేపల్లి మండల కేంద్రానికి చెందిన ఇద్దరు ఈడిగ హరిప్రసాద్, పిచ్చుకుంట్ల మారెప్ప, అన్నమయ్య జిల్లాకు చెందిన ముగ్గురు రానాకృష్ణబాబు, గోవిందుల ఆనంద్ బాబు, పోమారి బంగారి,కర్ణాటక రాష్ట్రం తుమ్ముకూరుకు చెందిన ఇద్దరు నయాజ్ అహ్మద్, ఏఆర్ శాంతరాజ్, చిక్‌బల్లాపూర్ జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్ బాబు, షికారి అర్జున్, ఎస్ బాబు ఒక ముఠా గా ఏర్పడ్డారు. వీరు దుర్వసనాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం ప్రజలను మోసం చేసేవారు. అందుకోసం ఒక గ్రూపుగా ఏర్పడి అమాయక ప్రజలకు తక్కువ ధరకే బంగారం ఇస్తామని ఆశ చూపేవారు. నకిలీ బంగారు తెప్పించుకొని అందులో నిజమైన బంగారు వస్తువులను కొన్నింటిని చేర్చేవారు. తాము జెసిపి పనులు చేస్తుండగా బంగారం బయటపడిందని తమ యజమానులకు తెలియకుండా తీసుకువచ్చి తక్కువ ధరకే అమ్ముతున్నామని నమ్మబలికేవారు. అమాయక ప్రజలను ఫోన్ ద్వారా పరిచయం చేసుకుని బంగారం ఆశ చూపి మోసాలకు పాల్పడేవారు. అందులో భాగంగా అనంతపురం జిల్లా విడపనకల్లు చెందిన ఈశ్వరన్నకు, అతని స్నేహితునికి మాయ మాటలు చెప్పారు. వారిని సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి దగ్గరలోకి పిలిపించి వారి దగ్గర నుండి 9 లక్షల రూపాయలు తీసుకొని నకిలీబంగారం అంటగట్టి పారిపోయారు. ఈ మేరకు బాధితుడు సోమందేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా కుప్పం మండలం పై పాల్యం గ్రామానికి చెందిన ముని వెంకటేష్ అను వ్యక్తికి ఫోన్లు చేసి అతనికి కూడా పై విధంగా బంగారు దండలు ఆశ చూపి అతనిని సోమందేపల్లి మండటం బ్రాహ్మణపల్లికి ఈనెల 9వ తేదీన పిలిపించి నకిలీబంగారం అంటగట్టి అతని వద్ద నుండి రూ.14 లక్షలను తీసుకువెళ్లారు. తాను మోసపోయినట్లు ఆలస్యంగా తెలుసుకున్న ముని వెంకటేష్ సోమందేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ రెండు కేసుల్లో వచ్చిన డబ్బులను అందరూ కలిసి పంచుకునే క్రమంలో పోలీసులు వారిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.21 లక్షల నగదు, ఐదు ద్విచక్రవాహనాలు, ఐదు కీప్యాడ్ సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి ముఠాలు రాష్ట్ర వ్యాప్తంగా పలు రకాల మోసాలకు పాల్పడుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ప్రజలకు సూచించారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పశు ఆరోగ్య శిబిరాలను ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతాయని పాడి రైతులు తమ పశువుల ఆరోగ్య పరిరక్షణకు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టిఎస్ చేతన్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పశుపోషకులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ తగిన నిధులు కేటాయించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు ఇస్తోందన్నారు. ఇందులో భాగంగానే పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకను పెంచడానికి, వ్యాధులు నియంత్రించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో 32 మండలాల్లో మండలానికి రెండు టీములు ప్రకారం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో టీం లో ఒక పశు వైద్యుడు ఒక పారా వెటర్నరీ సిబ్బంది, పశు వైద్య సహాయకులు, గోపాల మిత్రలు ఉంటారన్నారు. పశుసంవర్ధక శాఖ జెడి శుభదాస్ మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరాల్లో గొర్రెలు, మేకలకు, లేగ దూడలకు, పశువులకు నట్టల నివారణ మందులు తాగించడం జరుగుతుందన్నారు. గర్భకోశ వ్యాధులకు, ఎదకురాని పశువులకు తగిన పరీక్షలు చేసి చికిత్స చేస్తామన్నారు. ఈ వైద్య శిబిరాల గురించి రైతులలో అవగాహన కల్పించడానికి పోస్టర్లు కరపత్రాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతు సోదరులు వినియోగించుకొని తమ పశువులు రోగాల బారిన పడకుండా సంరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

అభివృద్ధి బాటలో రాష్ట్రం : మంత్రి సవిత

ప్రజాశక్తి రొద్దం

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాట పట్టిందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఈ మేరకు ఆమె మండలంలో జరుగుతున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. మండలంలోని శ్యాపురం గ్రామం వద్ద గోపాల స్వామి గుడికి వెళ్లే రహదారిలో నిర్మిస్తున్న సిసి రోడ్లు పనులను పరిశీలించారు. అనంతరం కంబాల పల్లి గ్రామంలో రూ. 80 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, శ్మశానానికి వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలసత్వానికి తావు లేకుండా, నాణ్యతలో రాజీ పడకుండా రోడ్లు నిర్మించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాధవ నాయుడు, కన్వీనర్ నరహరి, కంబాలపల్లి సర్పంచి మంజు, రాగిమికల పల్లి బాషా, టైలర్ ఆంజనేయులు, పుల్లప్ప, పలువు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి సవిత

చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

పెనుకొండ : ముఖ్యమంత్రిచంద్రబాబు కృషితోనే విశాఖ స్టీల్ ప్లాంట్ కు ఆర్థిక భరోసా లభించిందని, ఆయన ఢిల్లీ పర్యటనల వల్లే రూ.11,440 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్ర రాష్ట్రానికే విశాఖ స్టీల్ ప్లాంట్ మణిహారన్నారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అంటూ ఆనాటి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు పోరాటాలు చేశారని, అలాంటి ఉక్కు పరిశ్రమ తీవ్ర నష్టాల బారిన పడిన నేపథ్యంలో ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్ అండగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా విశాఖ స్టీల్ ప్లాంట్ అప్పుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. అప్పుడు నష్టాల్లో ఉన్నప్పుడు... ఇప్పుడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కు పరిశ్రమను గట్టెక్కించింది సీఎం చంద్రబాబేనని తెలిపారు. ప్రస్తుతం దావోస్ లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు.

'డాకు మహారాజ్' సక్సెస్ మీట్ విజయవంతం

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం నగరంలో బుధవారం సాయంత్రం జరిగిన డాకు మహారాజ్ సక్సెస్ మీట్ విజయవంతంగా నడిచింది. నగరంలోని అయ్యప్ప గ్రౌండ్స్ లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సినిమా ప్రిరిలీజ్ ఈవెంట్ ఇక్కడ జరగాల్సి ఉండగా తిరుపతిలో జరిగిన ఘటనతో అప్పుడు వాయిదా పడింది. ఇప్పుడు ఈ సినిమా విజయోత్సవ సభగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు ,బాలకృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్కడ ఎటువంటి ఘటన చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సినిమా విజయవంతం చేయడంలో భాగస్వామ్యులైన అందరినీ హీరో బాలకృష్ణ అభినందించారు. రాయలసీమ ప్రాంతమంటే సాధారణమైంది కాదని అన్నారు. 'రాయల్ సీమ అని పేర్కొన్నారు. ఈ ప్రాంత ఇతివృత్తంగా తీసిన తన సినిమాలు గతంలోనూ ఘన విజయాలు సాధించాయని గుర్తు చేశారు. ఇప్పుడు వచ్చిన డాకు మహారాజ్ అటువంటిందే అన్నారు. ఈ సినిమా విజయవంతం చేయడంలో కృషి చేసిన దర్శకుడు బాబి .సంగీత దర్శకుడు థమన్, ఇతర సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో హీరోయిన్లుగా నటించిన ప్రజ్ఞ జైశ్వాల్ ,శ్రద్ధ శ్రీనాథ , దర్శకుడు బాబి, సంగీత దర్శకుడు తమన్ తో పాటు సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. వీరితోపాటు ఎంపీలు అంబికా లక్ష్మీ నారాయణ ,బి కె పార్థసారథి , విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకట ప్రసాద్, ఎంఎస్ రాజు, పల్లె సింధూర, మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి, బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు గేసు , జగన్ తదితరులు పాల్గొన్నారు.



సక్సెస్ మీట్‌లో మాట్లాడుతున్న బాలకృష్ణ

సోలార్ పవర్ గ్రిడ్ల ఏర్పాటుకు ముందుకు రావాలి

ఎమ్మెల్యే బాలకృష్ణ



సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

సోలార్ పవర్‌గ్రిడ్ల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ కోరారు. బుధవారం హిందూపురం రూరల్ మండలంలో రూ. 11 కోట్లతో నిర్మించి తలపెట్టిన మూడు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ సబ్సిడీ పథకం ద్వారా సోలార్ పవర్ గ్రిడ్ లను ఏర్పాటు చేసుకోవాడానికి ప్రజలు, రైతులు ముందుకు రావాలన్నారు. అమర్చుకుంటే విద్యుత్ బిల్లులో దాదాపు 90శాతం వరకు ఆదా కావడానికి అవకాశం ఉందన్నారు. మరి కొంత మందికి విద్యుత్ శాఖ వారే డబ్బులు చెల్లించే చెలించే అవకాశం ఉందన్నారు. ఒక కిలో వాట్ సామర్థ్యం గల గల సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకుంటే నెలకు సుమారు 100 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వినియోగదారులందరికీ నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఏపీఐఐసీ గ్రోత్ సెంటర్ గోళ్లాపురం, కిరికెర, మోతుకపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లను నిర్మించడం జరుగుతుందన్నారు. గోళ్లాపురం సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే ఏపీఐఐసీ గ్రోత్ సెంటర్ లో ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలతోపాటు ఆ గ్రామ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. అలాగే కిరికిర సబ్ స్టేషన్ నిర్మాణం వల్ల హనుమేపల్లి, బేవనహళ్లి, బసవనపల్లి, నక్కలపల్లి, సంజీవరాయనిపల్లి, కిరికెర, అప్పలకుంట, మిట్టమీద పల్లి తదితర ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడానికి వీలవుతుందని తెలిపారు. దీనికి తోడు మోతుకపల్లి సబ్ స్టేషన్ నిర్మాణం వల్ల పరిగి రోడ్ లోని వాణిజ్య సముదాయాలకు, గృహ అవసరాలకు, హస్నాబాద్, మోతుకుపల్లి, వెంకటేశ్వర నగర్, సేవా మందిర్ తదితర ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ అందనున్నట్టు చెప్పారు. నాణ్యతలో ఏమాత్రం రాజీ లేకుండా త్వరితగతిన విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అదే విధంగా త్వరలో మరో 10 సబ్ స్టేషన్ లను ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ సురేంద్ర, డిఇఇ భూపతి, ఎఇ లక్ష్మికాంత్ రెడ్డి, టిడిపి నాయకులు బేవినహళ్లి ఆనంద్, కిరికెర రాము, న్యాయవాది శివశంకర్‌తో పాటు వివిధ శాఖ అధికారులు, టిడిపి నాయకులు, బాలయ్య అభిమానులు పాల్గొన్నారు.

హిందూపురం అభివృద్ధికి అహుడా నిధులు కేటాయించండి

హిందూపురం అభివృద్ధికి అనంతపురం- హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (అహుడా) నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే బాలకృష్ణ అహుడా ఛైర్మన్ టిసి. వరుణ్‌ను కోరారు. మంగళవారం రాత్రి బాలయ్యను ఆయన నివాసంలో జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టి.సి. వరుణ్‌కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వరుణ్ బాలకృష్ణతో చర్చించారు. హిందూపురం అభివృద్ధిలో అహుడా క్రియాశీలక భూమిక పోషిస్తుందని వరుణ్ పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి కోసం అహుడా నుంచి ప్రత్యేక నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరగా అందుకు అహుడా ఛైర్మన్ స్పందిస్తూ పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు సంజీవ రాయుడు, రాపా ధనంజయ, జిల్లా కార్యదర్శి రమణ, చంద్రశేఖర్, చిన్న ప్రవీణ్, చక్రవర్తి, లోకేష్, ముళి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

మోడల్ డిగ్రీ, ఉర్దూ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలి

హిందూపురం పట్టణంలో మోడల్ డిగ్రీ కళాశాలతో పాటు ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి ఎమ్మెల్యే బాలకృష్ణను కోరారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, నరసింహమూర్తి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బాలయ్యతో సింధూర, పల్లె

ఎమ్మెల్యే బాలయ్యను కలిసిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి బుధవారం ఎమ్మెల్యే బాలకృష్ణను అనంతపురంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజు విజయోత్సవ వేడుకను అనంతపురం నగరంలోని రామ్‌నగర్‌లో నిర్వహించారు. ఆ వేడుకకు హాజరైన బాలయ్యను వారు కలిశారు. పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ డాకు మహారాజ్ చిత్రం ఎంతో అద్భుతంగా ఉందని కొనియాడారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మనం చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని దుర్గమ్మ సేవా సమితి అధ్యక్షులు అనిల్ తెలిపారు. పట్టణంలోని ఎన్‌జిఒ హాలులో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అనిల్ మాట్లాడుతూ ఏటా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి తలసేమియా బాధితులు, ఆపదలో, అవసరం ఉన్న వారికి రక్తం అందజేస్తున్నామన్నారు. రక్తదానంపై అపోహలు వీడి ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు బాచి, మోహన్, అశోక్, కార్తీక్, హేమంత్, ప్రకాష్ పాల్గొన్నారు.


పింఛన్లను తనిఖీ చేస్తున్న అధికారులు

వికలాంగుల పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

కంటి చూపు, చెవుడు, అంగవైకల్యంకు సంబంధించిన దివ్యాంగుల పింఛన్లు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిని బుధవారం వారి ఇంటి వద్దే జిల్లా మెడికల్ టీం సభ్యులు పరిశీలించారు. వారి అర్హత సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. టీం సభ్యులు మాట్లాడుతూ పింఛను దారుల ఇళ్లకు వెళ్లి సర్టిఫికెట్లను పరిశీలించి పింఛన్ల అవకతవకలపై ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందజేస్తామన్నారు. పింఛన్ల తనిఖీ ప్రక్రియను జిల్లా హెల్త్ కోఆర్డినేటర్ డా. తిప్పేంద్రనాయక్ తనిఖీ చేశారు. సర్వేలో కదిరి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. హుస్సేన్, ఎంపిడిఒ పోలప్ప పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర వర్క్‌షాపులో జిల్లా కార్యదర్శి రమేష్

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

గుంటూరు జిల్లాలో నిర్వహించిన సిఐటియు రాష్ట్ర వర్క్ షాపునకు జిల్లా కార్యదర్శి రమేష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సంఘటిత, అసంఘటిత కార్మికలకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, కార్మికులపై వేధింపులు, తదితర సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని వర్క్ షాప్‌లో వివరించారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-రొద్దం

జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సిఎస్.సోమశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం కోగిర ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల్లో తీసుకోవాల్సిన మెలకువలు, జాగ్రత్తలను వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం రమాదేవి, బేబీరాణి, గిరినాథరావు, రవికుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించండి

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఎపిఒ మంజునాథ్, ఈసి సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో 25 గోకులం షెడ్లు మంజూరు కాగా 10 పూర్తి చేశారు, మిగిలిన 15 షెడ్లను నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. పొలాల్లో రైతులకు ఉపయోగపడే ఫారం పాండ్లు, ట్రెంచ్ పనులు కల్పించాలని తెలి పారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు రాజశేఖర్, శ్రీనివాసులు, మహేష్, అక్బర్, ఫీల్డ్ అసిస్టెంట్లు రమణప్ప, మనోహర్, శ్రీనివాసులు పాల్గొన్నారు

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని హొన్నంపల్లి గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంటలో బుధవారం ఏవో విజయభారతి ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. పంటకోత ప్రయోగాలను బీమా కంపెనీ కోఆర్డినేటర్లు అశోక్, నరేంద్ర పర్యవేక్షించారు. కార్యక్రమంలో హరీష్, రైతు పార్వతమ్మ పాల్గొన్నారు.


పంటకోత ప్రయోగాలు నిర్వహించిన అధికారులు

భూ కబ్జాలు అరికట్టి, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తిలో భూ కబ్జాలను అరికట్టాలని, పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వ్యకాసం ఆధ్వరంలో పేదలు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వ్యకాసం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, కోశాధికారి వెంకటేష్ మాట్లాడుతూ ఇటీవల పుట్టపర్తి రెవెన్యూ గ్రామ పొలంలో విలువైన భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. వాటిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నిరుపేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు. ఇప్పటికే సుమారు 200 మంది ఇళ్ల స్థలాల కోసం తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేసినా ఫలితం లేదన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. ఎక్కడా భూ కబ్జాలు జరగలేదని ప్రాథమిక విచారణలో తేలిందని, మరింత సమగ్ర విచారణ చేపట్టి నిజమని తేలితే ఎంతటి వారైనా ఉపేక్షించమని తెలిపారు. అనంతరం పేదలు అర్జీలు ఇచ్చారు. డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ 15 రోజుల తరువాత అర్జీల ఆధారంగా విచారణ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యురాలు రమాదేవి, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకురాళ్లు ప్రమీల, సరస్వతి, నూర్జహాన్, వెంకటరమణమ్మ, పార్వతి, రాధిక, సావిత్రి, చంద్రమోహన్, శశికళ, తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్


మున్సిపాలిటీలో పని చేస్తూ మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుం బాలకు బుధవారం కమిషనర్ ప్రమోద్‌కుమార్ రూ. 2 లక్షల చొప్పున చెక్కులు అందజే శారు. కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి. రమణ, కో కన్వీనర్ టి.అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ కార్మికులు శంకరయ్య, నారాయణరెడ్డి అనారోగ్య కారణాల వల్ల మృతి చెందారన్నారు. గతంలో సిఐటియు చేసిన పోరా టాల మేరకు వారి కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇచ్చారన్నారు. ఆయా కుటుంబాల్లో ఒకరికి కాంట్రాక్ట్ ఔటసోర్సింగ్ కార్మికు లుగా అవకాశం ఇవ్వాలని, సమ్మెకాలం హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ వీరేష్, అసిస్టెంట్ ఇంజినీర్ కళావతి, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు ఓబుళపతి, లింగరాజు, జిల్లా అధ్యక్షులు బొగ్గు నాగరాజు, అనిల్, దస్తగిరి, బాబు, వరదరాజులు పాల్గొన్నారు.


కార్మికుల కుటుంబాలకు చెక్కులు అందజేసున్న కమిషనర్

జనసేనపార్టీలో పలువురు చేరిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రూరల్ పరిధిలోని పోతుకుంట గ్రామానికి చెందిన 50 వైసిపి కుటుంబాలు బుధ వారం పట్టణంలోని జనసేనపార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరారు. చిలకం మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి, మండలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పలువురు జనసేనలో చేరుతున్నార న్నారు. కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పోతుకుంట గ్రామానికి చెందిన వైసిపి నాయకులు లడ్డూ అలియాస్ ఆదినారాయణరెడ్డితో పాటు 50 కుటుంబాలు జనసేనలో చేరాయి. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు డిష్ రాజు, వెంకటరెడ్డి, పట్టణ నాయకులు అడ్డగిరి శ్యామ్‌కుమార్, బ్యాల్ల భాస్కర్, తొండమలు రవి, కోటికి రామంజి, బండ్ల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


జనసేనలో చేరిన పోతుకుంట గ్రామ నాయకులతో చిలకం

నెలాఖరులోగా ఈ పంట నమోదు, ఈకేవైసీ చేయించాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెలాఖరులోగా సంబంధిత రైతు సేవా కేంద్రంలో ఈ పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పి.కొత్తపల్లి, పెడబల్లి గ్రామాల్లో బుధవారం ఏవో ఆధ్వర్యంలో వేరుశనగ, కంది పొలాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతు సుబ్బారెడ్డి పొలంలో వేరుశనగ పంటను సందర్శించి పంట ప్రస్తుతం పూత, ఊడగలు దిగే దశలో ఉన్నందున ఎకరాకు 200 కిలోల జిప్సం చల్లి తవ్వకం జరపాలని సూచించారు. తెగుళ్ల నివారణకు క్రిమి సంహారక మందులు పిచికారి చేసుకోవాలన్నారు. వరి నాట్లు వేసే రైతులు కొనలు తుంచి నాటుకోవాలన్నారు. ఆయన వెంట రైతు సేవా కేంద్రం సిబ్బంది అంజినాయక్, నారాయణస్వామి ఉన్నారు.

నల్లచెరువు : మండలంలోని రాజమౌళపల్లి, తండాలో ఏవో భారతి ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు వేరుశెనగ పంటను పరిశీలించి, రైతులకు యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ మందులను సూచించారు. రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. ఉద్యానశాఖ లో పండ్లు, పూల తోటల పెంపకం, ప్రోత్సాహకాల గురించి వివరించారు. ఐదెకరాల లోపు ఉంటే 90 శాతం సబ్సిడీపై రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేస్తామని, రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిఇఒ మణికంఠ, విహెచ్ఎ రాధా, రైతులు పాల్గొన్నారు.

టీకాలు, కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

స్థానిక పిహెచ్‌సి పరిధిలోని పెడపల్లి, నిడిమామిడి గ్రామాల్లో బుధవారం వైద్యాధికారి డాక్టర్ మునిచంద్రిక ఆధ్వర్యంలో గర్భిణులు, చిన్నపిల్లలకు వేసే వ్యాధి నిరోధక టీకాలు, కుష్టు వ్యాధిపై అవగా హన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. ఆసుపత్రిలోనే కాన్పు చేయించుకోవాలని, బిడ్డకు పుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టించాలని, శిశువుకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. అలాగే కుష్టు వ్యాధి లక్షణాలను వివరించి, లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందిస్తే ఆరు నెలల్లో పూర్తిగా నయం చేయవచ్చని వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, పౌష్టికాహారం తీసుకుంటూ ప్రజలు ఆరోగ్యవంతమైన జీవ నం సాగించాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, పిహెచ్ఎన్ లలిత కుమారి, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.


పిహెచ్‌సిలో సూచనలు ఇస్తున్న వైద్యాధికారులు

రహదారి ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-కదిరి టౌన్

రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టణ సిఐ నారాయణరెడ్డి వాహన చోదకులుకు సూచిం చారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల మాసం-2025లో భాగంగా బుధవారం పట్టణంలోని వాల్మీకి, చైతన్య, జైన్ పాఠశాలలకు చెందిన వాహనాలను తనిఖీ చేసి డ్రైవర్ల లైసెన్సులను పరిశీలించారు. రహదారి భద్రతా ప్రమాణాలు పాటించి ప్రమాదాలను అరికట్టాలన్నారు. డ్రైవర్లు, హెల్పర్లకు పాఠశాలల యాజమాన్యాల సమక్షంలో పలు సూచనలు చేశారు. సమావేశంలో వాల్మీకి స్కూల్ కరెస్పాండెంట్ అనిల్ కుమార్‌రెడ్డి, జైన్ పాఠశాల కిషోర్ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : మండలంలోని ప్రయివేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, అతివేగంగా డ్రైవింగ్ చేయరాద న్నారు. మైనర్లు, 60 ఏళ్లు పైబడిన వారు బస్సులు నడపరాదన్నారు. ప్రతి బస్సు గుడ్ కండిషన్‌లో ఉండి ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ ద్వారం కలిగి ఉండాలన్నారు. ఎలాంటి రోడ్డు ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.


స్కూల్‌బస్సుల డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ నారాయణరెడ్డి

చిన్నపిల్లల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుధాకర్‌రావు సూచించారు. చలికాలంలో చిన్నపిల్లలకు దగ్గు, ఆయాసం, జలుబు, ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరుతుందన్నారు. తుమ్ములు, దగ్గు వచ్చినప్పుడు వైరస్ వ్యాపిస్తుందని, ఆ సమయంలో మాస్క్ లేదా టిష్యూ పేపర్ మూతికి అడ్డం పెట్టుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. వేడిగా ఉండే పదార్థాలను మాత్రమే భుజించాలని, గోరువెచ్చని నీటినే తాగాలన్నారు. ఫ్రిడ్జ్‌లో ఉంచినవి తీసుకోవద్దన్నారు. తాజా కాయగూరలు, పండ్లు భుజించాలన్నారు.


డీఎస్పీని సన్మానిస్తున్న ఎస్పీ రత్న, ఎఎస్పీ

బదిలీ డీఎస్పీకి సన్మానం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు బదిలీ అవ్వగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్పీ వి.రత్న ముఖ్యఅతిథిగా హాజరై పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ ధర్మవరం సబ్ డివిజన్‌లో శాంతి భద్రతలను పరిరక్షించడంలో డీఎస్పీ తీసుకున్న చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ధర్మవరం నూతన డీఎస్పీ హేమంత్‌కుమార్, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐలు వలి, మహేష్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అల్ట్రా మారథాన్ రన్

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక ఆర్‌డిటి ఆసుపత్రి వద్ద ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్ వద్ద ఆర్‌డిటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్ట్రా మారథాన్ రన్ ముగింపు సభను విజయవంతం చేయాలని ఆర్‌డిటి ఆర్‌డి ప్రమీల కుమారి, ఎటిఎల్ రుక్మాంగధ కోరారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అల్ట్రా మారథాన్ రన్ వెంకటాద్రిపల్లి నుంచి ప్రారంభమై ముష్టూరు, రాఘవంపల్లి మీదుగా బత్తలపల్లికి చేరుకుంటుం దన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్ వద్ద ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. అందులో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కుష్టు వ్యాధిపై సర్వే

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక అంబేద్కర్‌నగర్, సాయినగర్ కాలనీల్లో చేపట్టిన కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేను బుధవారం మండల వైద్యాధికారి ఓంకార్ పరిశీలించారు. ఆయన ప్రజలకు కుష్టు లక్షణాలను తెలిపి ఎవరికైనా ఉంటే వెంటనే సమీపంలోని ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలకు సమాచారం అందించాలని తెలిపారు. సిబ్బంది తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పరిశీలించి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వేలో సిహెచ్ఓ మనోహర్‌రెడ్డి, ఎఎన్ఎం గంగరత్న, శాంతి, సరస్వతి, భారతి పాల్గొన్నారు.


గాండ్లపెంటలో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని గొడ్డువెలగల, వేపరాల గ్రామాల్లో బుధవారం పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పశువైద్యాధికారి బి.చెన్నకేశవనాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆవులు, గేదెలు, దూడలు, గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకా, నట్టల నివారణ మందులు వేసి వైద్యసేవలు అందించారు. పాడి రైతులకు పలు సూచనలు చేశారు. శిబిరంలో పశువైద్య సిబ్బంది గంగాధర్, లక్ష్మిరెడ్డి, జగదీష్, సాయిగౌతమి, మానస, నారాయణస్వామి, రైతులు పాల్గొన్నారు

సోమందేపల్లి : మండలంలోని మండ్లి గ్రామంలో మండల పశువైద్యాధికారి బాలాజీ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దూడలు, ఆవులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించి, ప్రాథమిక చికిత్స చేశామన్నారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ నెల 31వ తేదీ వరకూ గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహి స్తామని తెలిపారు. శిబిరంలో సచివాలయ సిబ్బంది, పశు వైద్యులు అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగళి : శీతాకాలంలో మూగ జీవాలకు వచ్చే రోగాలను అరికట్టేందుకు నట్టల నివారణ మందు చాలా అవసరమని పశువైద్యాధికారి డాక్టర్ కిషోర్ తెలిపారు. మండలంలోని ఇరిగేపల్లి, నందరాజునపల్లిలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గొర్రెలు, మేకలు, ఆవు దూడలకు నట్టల నివారణ మందు తాపించారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో విఎల్ఒ కృష్ణమోహన్, జీఎలు మూర్తి, హనుమంతరాయ, సిద్దేశ్, నాగరాజు, సిబ్బంది హాజరయ్యారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-నల్లచెరువు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం సమతా ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు మండల కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. ఎంపిడిఒ రఘునాథగుప్తా మాట్లాడుతూ చదువుకునే వయసులో పిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పురుషులకు 21, మహిళలకు 18 దాటిన తర్వాతే వివాహం చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ గంగరత్నమ్మ, సూపర్వైజర్ రఫీమున్నీసా తెలిపారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల కలిగే దుష్పరిణామాలను తహశీల్దార్ రవికుమార్ వివరించారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

ధర్మవరం డీఎస్పీగా బి.హేమంత్‌కుమార్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం నూతన డీఎస్పీగా బి.హేమంత్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం గ్రేహౌండ్స్‌లో ప్రొబేషన్ డీఎస్పీగా పని చేస్తూ ఉద్యోగోన్నతి బదిలీపై ఇక్కడికి వచ్చారు. తాడిపత్రిలో శిక్షణ డీఎస్పీగా పని చేశారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న డీఎస్పీ శ్రీనివాసులు మంగళగిరి హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. డీఎస్పీ శ్రీనివాసులు నూతన డీఎస్పీ బి.హేమంత్ కుమార్‌కి బాధ్యతలు అప్పగించారు. నూతన డీఎస్పీ కార్యాల యాన్ని పరిశీలించ పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బంది నూతన డీఎస్పీకి పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలు నేరుగా మండల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు చేయాలన్నారు. అక్కడ న్యాయం జరగకపోతే తనను కలవాలన్నారు. సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది ప్రజల పట్ల గౌరవం, మర్యాదతో మెలగాలన్నారు. ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటానని తెలి పారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు. మట్కా, జూదం, బాల్య వివాహాలను అరికట్టేందుకు, స్పందన, నైట్ బీట్, పల్లెనిద్ర తదితర కార్యక్రమాలను పక్కాగా నిర్వహించేలా చర్యలు చేపడతానని తెలిపారు.


బాధ్యతలు చేపడుతున్న డీఎస్పీ బి.హేమంత్‌కుమార్

పిహెచ్‌సిల తనిఖీ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక పిహెచ్‌సిని బుధవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేంద్ర నాయక్ సందర్శించి పలు రికార్డులు, ల్యాబ్, ఫార్మసీ గదులను పరిశీలించారు. రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి తెలిపారు. సకాలంలో వ్యాక్సిన్ వేయాలని, ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. ప్రతి ప్రసవం పిహెచ్‌సిలోనే జరిగేటట్లు, తద్వారా అందే ప్రభుత్వ ప్రోత్సాహకాలను ప్రజలకు వివరించాలని వైద్యాధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్‌వర్ధన్, సూపర్‌వైజర్లు శాంతమ్మ, మహేశ్వర్ రెడ్డి, ఫార్మాసిస్ట్ ప్రకాశం, విజయ్ పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక పిహెచ్‌సిని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేంద్రనాయక్ సందర్శించి ప్రతి వార్డుతో పాటు ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. రికా ర్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పులిగుండ్లపల్లి ఆయు ష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించి వైద్యసేవలపై ఆరా తీశారు. ఆయన వెంట వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


తలుపులలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-బత్తలపల్లి

వేరుశనగ పంటకు మచ్చ తెగుళ్లు ఆశించకుండా మందులు పిచికారి చేసుకోవాలని జిల్లా డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త రామసుబ్బయ్య సూచించారు. ఆయన బుధవారం ధర్మవరం ఎడిఎ క్రిష్ణయ్య, బత్తలపల్లి ఏవో ఓబిరెడ్డితో కలిసి మండలంలోని పోట్లమర్రి గ్రామంలో వేరుశనగ పంటను పరిశీలించారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలు కురవడం, ప్రస్తుతం చలి తీవ్రత, గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల సెప్టెంబర్ ఆఖరు నుంచి అక్టోబర్ ఆఖరి లోపు విత్తనం వేసిన వేరుశెగ పంటలో నల్ల మచ్చ తెగుళ్లను ఎక్కువగా గమనించామన్నారు. దాని నివారణకు రైతులు మందులు పిచికారి చేసుకోవాలన్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో సాగు చేసిన వేరుశెనగ పంట ప్రస్తుతం బాగానే ఉందని, అయితే రైతులు పంటను జాగ్రతగా పరిశీలిస్తూ మచ్చ తెగులు ఆశించిన వెంటనే మందులు పిచికారి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వారి వెంట రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు.


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

జగనన్న కాలనీల్లో విజిలెన్స్ అధికారుల విచారణ

ప్రజాశక్తి-కొత్తచెరువు

గత వైసిపి ప్రభుత్వంలో కొత్తచెరువు సమీపంలో జగనన్న కాలనీల పేరిట మూడు కాలనీలు ఏర్పాటు చేశారు. వాటికి భూములు ఇచ్చిన రైతులను బుధవారం విజిలెన్స్ సిఐ సద్గురుప్రసాద్, ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ధర్మవరం రోడ్డులో ఉన్న 384 సర్వే నెంబర్‌లో భూములు ఇచ్చిన రైతులతో గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందిం దా లేదా అని ప్రశ్నించగా రైతులు అందిందని తెలిపారు. అనంతరం అధికారులు వారి నుంచి అర్జీలు స్వీకరించారు. పెనుకొండ రోడ్డులో ఉన్న జగనన్న కాలనీకి వెళ్లేందుకు రహదారి సమస్య ఉన్నందున ఆ కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు జరగలేదని రహదారి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, అధికారులు వాసు ప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లిలో బుధవారం టిడిపి సీనియర్ నాయకులు నిమ్మకాయల రామంజనేయులు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే మంత్రి సవిత ఆ గ్రామం వెళ్లి రామంజి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ రామాంజనేయులు మృతి టిడిపి, వారి కుటుంబానికి తీరని లోటు అన్నారు. మంత్రి వెంట మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి.ఆంజనేయులు, నీరుగంటి చంద్ర, మాగేచెరువు సర్పంచి నరసింహులు, చల్లాపల్లి రామకృష్ణ, భానుకీర్తి, బాబయ్య, డీలర్ మురళి ఉన్నారు.


రామాంజనేయులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి

శ్యాపురంలో..

రొద్దం : మండలంలోని శ్యాపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు మల్లిరెడ్డి(70) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే మంత్రి సవిత ఆ గ్రామం వెళ్లి మల్లిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట టిడిపి మండల కన్వీనర్ నరహరి, నాయకులు మాధవనాయుడు, టైలర్ ఆంజనేయులు, వెంకటరామిరెడ్డి, కంబాలపల్లి సర్పంచి మంజు, నాగరాజు, బాషా, డీలర్ రామాంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.



రొద్దంలో మల్లిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి

రేపు పరిటాల రవి వర్ధంతి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఈ నెల 24వ తేదీ రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామంలో నిర్వహించే పరిటాల రవీంద్ర వర్ధంతికి కార్యక్రమానికి మండలం నుంచి టిడిపి శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని టిడిపి నాయకుల కోరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో 1989-94 కాలంలో సామాన్యులు జీవించే పరిస్థితులు లేకపోవడంతో పాటు మహిళలు స్వేచ్ఛగా బయటకు వచ్చే పరిస్థితి ఉండేది కాదన్నారు. ఆ సమయంలో పరిటాల రవీంద్ర ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపి ధర్మవరంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పారని తెలిపారు. కార్యక్రమంలో ఎపి సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమితం కాటమయ్య, నాయకులు చిగిచెర్ల ఓబిరెడ్డి, చింతలపల్లి మహేష్ చౌదరి, మద్దిలేటి, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, నాగూర్ హుస్సేన్, పోతుకుంట లక్ష్మన్న, చింతపులుసు పెద్దన్న, బొట్టు కృష్ణ పాల్గొన్నారు.

బత్తలపల్లి : పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన పరిటాల రవీంద్ర వర్ధంతి సభకు మండలం నుంచి టిడిపి శ్రేణులు పెద్దఎత్తున తరలి వెళ్లాలని టిడిపి నాయకులు కోరారు. స్థానిక పార్టీ కార్యాల యంలో వారు మాట్లాడుతూ మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, పరిటాల అభిమానులు తరలివెళ్లి వర్ధంతి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో క్లస్టర్ ఇంచార్జిలు సురేంద్ర నాయుడు, నెట్టెం రమణ, మాజీ సర్పంచ్ చిత్రా నాగభూషణ, మోహన, చిదంబర్ రెడ్డి, మనోజ్, బోయ మందులు శ్రీనివాసులు, చంద్రశేఖర్,అక్కులప్ప, తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు,


బత్తలపల్లిలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు